క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మోహన్ నాయక్ చౌహాన్



జక్రాన్‌పల్లి: నల్లగుట్ట తండాకు చెందిన మూడ్ మోహన్‌నాయక్ చౌహాన్‌ను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, మునిపల్లికి చెందిన మత్రిపల్లి నవీన్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి వారికి నియామక పత్రాలను అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సన్మానం



ఖలీల్‌వాడి: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించినందుకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సుదర్శన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. . రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ నేతలు పులి శ్రీనివాస్, అంతిరెడ్డి రాజిరెడ్డి ఉన్నారు.

మానాల మోహన్‌రెడ్డికి..



ఖలీల్‌వాడి: రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నేతలు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజనరేందర్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం తదితరులున్నారు.

బాజిరెడ్డికి శుభాకాంక్షలు



సిరికొండ: బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను పార్టీ మండల నాయకులు హైద్రాబాద్‌లో ఆదివారం కలిశారు. ఎంపీ అభ్యర్థిగా ఎంపికైనందున శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. వైస్ ఎంపీపీ రాజన్న, బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

అభినందనలు



నిజామాబాద్‌నాగారం:నాగారం రాజారామ్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ప్రత్యేకంగా అభినందించారు. నూతన అధ్యక్షుడిగా మఠం రవి, ఉపాధ్యక్షుడిగా దీపక్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా గంగాధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ నాయకులు పవన్, ఆనంద్, గిరి, సతీష్, పాల్గొన్నారు.

శ్రీరామనవమికి కొటేషన్స్ స్వీకరణ

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ సాయిబాబా ఆలయంలో రానున్న శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయానికి రంగులు వేయడానికి, విద్యుత్ దీపాల అలంకరణ, ఆలయంలో పూల అలంకరణ చేయటానికి, క్యూలైన్‌ల్లు ఏర్పాటు చేయటానికి, వంట సామాను, టెంట్ హౌజ్ సామగ్రి అందించటానికి, అన్నదానం, వంట చేయటానికి ఈ నెల 23 వరకు కొటేషన్లు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీరాంరవీందర్ గుప్తా తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో ఎవరు తక్కువకు కొటేషన్‌లు వేస్తే వారికి పని అప్పగిస్తామన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కె. గంగాధర్, యువమోర్చ అధ్యక్షుడు గంగోల్ల ప్రశయ్‌తేజ్, ఓబీసీ మండల అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో బీజేపీలో ఆదివారం చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



ఆదమరిస్తే అంతే సంగతి..

- కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద చీకట్లు
- రాత్రివేళలో ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కార్పొరేషన్ రిపోర్ట్

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద రాత్రి వేళల్లో చిమ్మ చీకట్లు నెలకొంటున్నాయి. లైట్లు లేని కారణంగా ప్రయాణికులు రోజుకు ఇద్దరు ముగ్గురు ప్రమాదాల బారిన పడుతున్నారు. చౌరస్తా వద్ద ఒక హైమస్ట్ లైట్‌ను ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఏ ఇబ్బందీ ఉండదని వాహనదారులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు. నాలుగు రోజులు క్రితం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న గొర్రెల లారీ బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద లైట్లు లేకపోవడంతో ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న కారును ఢీకొట్టింది. వేగంగా ఢీకొనడంతో లారీలో ఉన్న 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ సంఘటన మరువకముందే ఒకరిద్దరు టూవీలర్ బైకులు ఎదురుగా వచ్చే వాహనాలు ఢీ కొన్నారు. అధికారులు స్పందించి బైపాస్ వద్ద జంక్షన్లో లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా, నాల్గవ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. బైపాస్ మార్గంలో ఎన్నో వాహనాలు రాత్రివేళలో ప్రయాణిస్తూ ఉంటాయి. కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ ప్రాంతంలో ఎలాంటి ప్రయాణ హెచ్చరికలు లేకపోవడంతో ప్రయాణికులు ఎటు పోవాలో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళలో ఆప్రాంతంలో ఎక్కడ నుంచి ఏ వాహనం వస్తుందో కూడా తెలియడం లేదు. అధికారులు స్పందించి భారీ ప్రమాదం జరగకముందే అక్కడ హైమస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు



అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రయాణికులు, వాహనదారులు కంఠేశ్వర్ చౌరస్తా వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి పూట ప్రయాణికులు కంఠేశ్వర్ సిగ్నల్ వద్ద ఎటు పోవాలో తెలియక అయోమయంలో పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సిగ్నల్ వద్ద లైట్లను ఏర్పాటు చేయాలి.

– కోర్వా రాజేంద్ర ప్రసాద్, ఖానాపూర్

లైట్లను త్వరగా ఏర్పాటు చేయాలి



కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద లైట్లను త్వరగా ఏర్పాటు చేయాలి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు పట్టించు కుని ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలి. ఇక్కడ రోడ్డు కూడా అస్తవ్యస్తంగా ఉంది. దానిని కూడా సరి చేయాలి.

– జాజున ప్రభాకర్, ప్రయాణికుడు

కోడ్ కూసింది

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రాత్రికి రాత్రి చర్య లు చేపట్టింది. దీనిలో భాగంగా నగరంలోని ప్రధాన చౌరస్తాల్లో గల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వచ్చే వరకు ఈ ముసుగులు తొలగించబోమ ని అధికారులు పేర్కొన్నారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలో విగ్రహాలకు ముసుగులు తొడిగిన దృశ్యం

ఉపాధ్యాయుల బకాయిలను జమ చేయాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

పెర్కిట్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్మూర్, ఆలూర్ మండల కేంద్రాల్లో ఆదివారం టీపీయూఎస్ సంఘం సభ్యులు సమావేశమై ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. మార్చి 31లోపు ఉపాధ్యాయుల పీఆర్‌సీ, జీపీఎఫ్‌లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా జన జాగరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పాపగారి రామకృష్ణారెడ్డి, నల్ల కిషన్ రెడ్డి, శివాజీ, రుద్ర మధుసూదన్, రుద్ర రజిత, వెంకటరమణ, రవి, గజేందర్, సృతిమ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌ను మాల సామాజికవర్గానికే కేటాయించాలి



నిజామాబాద్‌నాగారం: ఎస్సీ కమిషన్ పదవిని మాలలకే కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో మాట్లాడారు. రాష్ట్రంలో 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులలో మాల సామాజికవర్గానికి స్థానం కల్పించకపోవడం శోచనీయం అన్నారు. రాబోవు రోజుల్లో మరికొన్ని చైర్మన్ పదవుల నియామకాలలో ఎస్సీ కమిషన్‌తో పాటు, రెండు చైర్మన్ పదవులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిరికొండ: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ కోరారు. కుర్దులపేట్‌లో వడగండ్ల వానతో దెబ్బతిన్న పొలాలను, తడిచిన ధాన్యాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, రాజేందర్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలో అధికారులు..

ఇందల్వాయి: వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఏడీఏ ప్రదీప్ కుమార్, తహసీల్దార్ వెంకట్ రావు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరించారు. నల్లవెల్లి, డొంకల్ గ్రామాల్లో నష్టం అధికంగా ఉందని తెలిపారు.



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ జగన్

అధికారులకు పాస్‌బుక్, ఆధార్‌కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్సులను అందించాలని తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, ఏవో ప్రవీణ్ కుమార్, ఏఈవోలు ఉన్నారు.

సిరికొండలో..

సిరికొండ: పెద్దవాల్గోట్, మైలారం, పందిమడుగు, చీమన్‌పల్లి, తాటిపల్లి, కొండూర్ గ్రామాల్లో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పొలాలను ఏడీఏ ప్రదీప్ కుమార్, ఏవో వెంకటేష్‌లు ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో 1552 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఏఈవోలు శ్రీకాంత్, నిఖిల్ ఉన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: రామడుగు, నడిమి తాండ, కొటాల్‌పల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో ప్రవీణ్‌లు పరిశీలించారు. ఈ నెల 21 వరకు వర్షాలు ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సూచించారు. కోసిన ధాన్యాన్ని టార్పాలిన్‌తో కప్పి ఉంచాలన్నారు. ఏఈవోలు మనోజ్‌కుమార్, లావణ్య ఉన్నారు.



కొండూర్‌లో ..



రామడుగులో..



నల్లవెల్లిలో పరిశీలిస్తున్న ఏడీఏ ప్రదీప్ కుమార్

వైభవంగా చక్రతీర్థం

- ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని అశోక్ ఫారంలో గల వైభవ వేంకటేశ్వర స్వామి చక్రతీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాలుగో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, శాంతిపాఠం, చతుస్థానార్చన, నిత్యవాహనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం నిర్వహించి, విష్ణు సహస్రనామ పారాయణం, ద్వాదశ ఆరాధన, శ్రీపుష్పయాగం తదితర కార్యక్రమాల నిర్వహణతో ఉత్సవాలు ముగిశాయి.



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



హోమం నిర్వహిస్తూ..

ముక్కు మూసుకోవాల్సిందే..!



నిజామాబాద్‌నాగారం: శనివారం రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షం నగర ప్రజానీకాన్ని భయాందోళనలకు గురి చేసింది. నగరంలో శానిటేషన్ పనితీరును మరొక్కసారి గుర్తు చేసింది. మురుగు కాలువలు సక్రమంగా తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి మురుగు నీరు ఏరులై పారింది. చంద్రశేఖర్‌కాలనీలో మురుగు కాలువల పరిస్థితిని కళ్లకు కట్టినట్లు కనిపించింది. ఇదే కాదు రైల్వేస్టేషన్, బస్టాండ్, అర్సపల్లి, మాలపల్లి, ఆటోనగర్, ఖిల్లా, తదితర ప్రాంతాల్లో పరిస్థితులు మరింత అధ్వానం ఉన్నాయి. శానిటేషన్ అధికారులు కాస్త దృష్టి పెట్టి మురుగు కాలువల విషయంలో చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నేటి చిత్రం..



బాబోయ్ కుక్కలు

నగరంలోని ఆయా కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా కుక్కలు తిరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా శివారు కాలనీలలో కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల సంచారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

30న డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస సమావేశం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు నిజామాబాద్ రూరల్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో పులి నర్సింగ్‌రావుతో పాటు మండల ఎంపీటీసీలకు నోటీసులు పంపించారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 11 మంది బీఆర్‌ఎస్ పార్టీ, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ, ఒకరు బీజేపీ, ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు విజయం సాధించారు. అప్పటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రోత్సాహంతో బీఆర్‌ఎస్‌కు చెందిన దూస్‌గాం ఎంపీటీసీ గద్దె భూమయ్య ఎంపీపీగా, నడిపల్లి –1 ఎంపీటీసీ కులాచారి శ్యాంరావు వైస్ ఎంపీపీగా ఎంపికయ్యారు. అనంతరం కొంత కాలం తర్వాత ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఇద్దరూ బీజేపీలో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం బాజిరెడ్డి గోవర్ధన్ పరాజయం పాలై, రూరల్ ఎమ్మెల్యేగా భూపతిరెడ్డి విజయం సాధించారు. ఇటీవల భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. అయితే ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. ముల్లంగి(బి)కి చెందిన నడిపల్లి–2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా చేయడానికి కాంగ్రెస్ ఎంపీటీసీలతో పాటు నలుగురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు మద్దతు తెలుపుతున్నారు.

జూలై 7 వరకు పదవీకాలం..

జనవరి 12న డిచ్‌పల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం కోరుతూ నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు లేఖ అందజేశారు. జనవరి 29న అవిశ్వాస సమావేశం నిర్వహించాలని ఆర్డీవో నోటీసులు జారీ చేశారు. అయితే ఎంపీపీ గద్దె భూమయ్య హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తేవడంతో కేవలం వైస్ ఎంపీపీపై మాత్రమే అవిశ్వాసం నిర్వహించారు. అవిశ్వాసం నెగ్గడంతో వైస్ ఎంపీపీ శ్యాంరావు తన పదవిని కోల్పోయారు. అయితే హైకోర్టు స్టే ఎత్తి వేయడంతో ఈ నెల 30న ఎంపీపీపై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించేందుకు ఆర్డీవో మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఇసుక బహిరంగ వేలం



జక్రాన్‌పల్లి: మనోహరాబాద్ జీపీ కార్యాలయంలో సోమవారం ఇసుక వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్మయి, ఆర్‌ఐ ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 14న భూగర్భ, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను పట్టుకుని సీజ్ చేశామన్నారు. 58 ట్రాక్టర్ల ఇసుక సుమారు 174 క్యూబిక్ మీటర్లు ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండ: గడ్డమీదితండా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. పార్టీ నాయకులు శ్రీధర్, జగన్, సంతోష్, గాసొద్దీన్, బుచ్చన్న, ఎల్లయ్య, లక్ష్మణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	66,600	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	61,420	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	35	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రేమలు (తెలుగు) - 1.30, 7.30, గామి (తెలుగు) - 4.30, 10.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.40, భీమా (తెలుగు) - 1.40, 4.30, 7.40 యోధ (హిందీ) - 10.40
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యోధ (హిందీ) - 10.10, 1.10, 7.10, 10.10, షరతులు వర్తిసాయి - 4.10
స్క్రీన్-2	ప్రేమలు - 4.45, రజాకార్ (తెలుగు) - 10.20
స్క్రీన్-3	గామి (తెలుగు) - 10.25, 7.20 సైతాన్ (హిందీ) - 1.35 లంబసింగి (తెలుగు) - 4.35, బస్తర్ (ది నక్సల్ కథ) 10.30
స్క్రీన్-4	తంత్ర (తెలుగు) - 10.30 బస్తర్ (ది నక్సల్ కథ) 1.25, భీమా (తెలుగు) 4.15, సైతాన్ (హిందీ) - 7.20, 10.30
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	తంత్ర (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)